క్లుప్తంగా

ఇంటింటికీ 'అయోధ్య' అక్షతలు


అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవం ప్రచారంలో రాముని భక్తులు

భామిని: అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవం పురస్కరించుకుని, మండలంలోని దిమ్మిడిజోల, నేరడి–బి, నులకజోడు గ్రామాల్లో భక్తులు ఇంటింటికీ వెళ్లి, అక్షతలు గురువారం పంచిపెట్టారు. శ్రీరాముని కీర్తిస్తూ అయోధ్యలో నూతనంగా నిర్మించిన రామమందిరం విశిష్టతను వివరించారు.

డివైడర్‌ను ఢీకొన్న లారీ


డివైడర్‌ను ఢీకొట్టిన లారీ

సీతంపేట: స్థానిక ఐటీడీఏ సమీపంలో రోడ్డు డివైడర్‌ను ఓ లారీ గురువారం ఢీకొట్టింది. కొత్తూరు నుంచి సీతంపేట వస్తుండగా, అదుపుతప్పడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. అదృష్టవశాత్తు ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు.

12 మద్యంసీసాల స్వాధీనం

పాలకొండ రూరల్: మండలంలోని ఎం.సింగుపురం గ్రామంలో చేపట్టిన తనిఖీల్లో అక్రమంగా విక్రయిస్తున్న 12 మద్యంసీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ ప్రశాంత్‌కుమార్ గురువారం తెలిపారు. గ్రామానికి చెందిన వారణాసి జగన్మోహనరావు దుకాణంలో అక్రమంగా మద్యం విక్రయాలు చేపడుతున్నట్లు విషయం తెలిసి, ఆకస్మిక తనిఖీలు చేసి, మద్యంబాటిళ్లను పట్టుకున్నామన్నారు. ఇదే ఘటనపై కేసు నమోదు చేశామన్నారు. అనుమతులు లేకుండా మద్యం విక్రయించినా, తరలించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గ్రామసభల్లో అభివృద్ధి ప్రణాళికలు

గరుగుబిల్లి: గ్రామసభల్లో గ్రామ అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికలు రూపొందించడం జరుగుతుందని గొట్టివలస సర్పంచ్ బి.చంద్రినాయుడు అన్నారు. మండలంలోని గొట్టివలస గ్రామంలో గ్రామసభ గురువారం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి భాస్కరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సభలో గ్రామంలోని సమస్యల పరిష్కారానికి అవసరమైన ప్రణాళికలు రూపొందించి, ప్రజలందరి ఆమోదంతో పనులు గుర్తించడం జరుగుతుందన్నారు.

షిర్డీసాయికి ప్రత్యేక పూజలు


పూజలందుకున్న షిర్డీసాయిబాబా

వీరఘట్టం: మండలంలోని వండవ గ్రామ షిర్డీ సాయి ధ్యాన మందిరంలో కొలువైన బాబాకు భక్తులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త మజ్జి సింహాచలం ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొన్న భక్తులంతా ఓం సాయి.. శ్రీసాయి.. జయ జయ సాయి.. అంటూ బాబాను ఆరాధించారు. మధ్యాహ్నం భక్తులకు నారాయణ సేవ చేశారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్–2 కార్యక్రమం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎస్.సాల్మన్‌రాజు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. ఇదే విషయమై స్థానిక విలేకరులతో మాట్లాడిన ఆయన ప్రజలంతా ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వాహన తనిఖీలు

పాలకొండ: స్థానిక యాలాం జంక్షన్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు గురువారం చేపట్టారు. ఎస్‌ఐ ప్రశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది అటువైపుగా వచ్చే వాహనాలను ఆపి, వాహనానికి సంబంధించిన ధ్రువపత్రాలు, లైసెన్స్‌లు పరిశీలించారు. ఆయా ధ్రువపత్రాలు లేని వారికి అపరాద రుసుం విధించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, పండగ నేపథ్యంలో సురక్షిత ప్రయాణాలు చేయాలని వాహనదారులకు తెలిపారు.

సంతాప సభ

జియ్యమ్మవలస: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విస్తరణాధికారిగా పనిచేస్తున్న ఎస్.మురళీరావు ఇటీవల మృతి చెందారు. ఈ మేరకు కార్యాలయంలో గురువారం సంతాప సభ ఏర్పాటు చేసి, మురళీరావు మృతికి సిబ్బంది సంతాపం తెలిపారు. ఆయన ఆకస్మిక మరణం తమను కలచివేసిందని, విధుల్లో ఆయన చిత్తశుద్ధి, నిబద్ధత చూపించే వారని కొనియాడారు.

వైఎస్సార్ సీపీతోనే అన్నివర్గాలకు మేలు

వలంటీర్ చొరవతో పింఛన్..



ఈ ఫొటోలో ఉన్న యువకుడి పేరు మీసాల నర్సింగరావు. వీరఘట్టం ప్రాంతానికి చెందిన ఈ వ్యక్తి పుట్టుకతోనే మూగ, చెవుడు. అన్ని అర్హతలున్నా.. ఇతడికి ఆధార్‌కార్డు గానీ, రేషన్‌కార్డు గానీ లేకపోవడంతో పింఛన్ పొందే అవకాశం లేకుండా పోయింది. ఇదే విషయాన్ని గుర్తించిన వలంటీర్ ఈయన పరిస్థితిని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు చేయించి, పింఛన్‌కు దరఖాస్తు చేయించారు. ప్రభుత్వం వెంటనే రూ.3 వేల పింఛన్ మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో సదరు వలంటీర్ సేవలను ఎమ్మెల్సీ విక్రాంత్, ఎమ్మెల్యే కళావతి అభినందించారు.

- కొత్త పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి


కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

వీరఘట్టం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే రాష్ట్రంలోని అన్నివర్గాలకు మేలు అని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో కొత్తగా మంజూరై పింఛన్ల పంపిణీ గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి చేతులమీదుగా 146 మంది కొత్త లబ్ధిదారులకు ఫించన్ నగదు అందజేశారు. అనంతరం ఎమ్మెల్సీ విక్రాంత్ మాట్లాడుతూ తనదైన శైలిలో సుపరిపాలన అందించి, రాష్ట్ర ప్రజల మనసును గెలుచుకున్న ఏకైక నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, ఆయన అన్ని ప్రాంతాలు, అన్నివర్గాల ప్రజలు బాగుండాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం సామాజిక పింఛన్ల పెంపు చేపట్టారన్నారు. ఇప్పుడు ప్రతీ లబ్ధిదారుడికి రూ.3 వేల పింఛన్ అందిస్తున్నారన్నారు. ఇదే కాకుండా సభలు, సమావేశాలు, సదస్సుల్లో ఆయన ఇచ్చిన ఎన్నో హామీలను నెరవేర్చారన్నారు. అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించడం జరుగుతోందన్నారు. ఇప్పటి వరకు అమలైన ఏ ఒక్క పథకంలోనూ ఇంతవరకు అవినీతి జరిగిందన్న దాఖలాలు లేవని, ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శమన్నారు. ప్రజలకు చేస్తున్న మంచిని చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా లేనిపోని ఆరోపణలతో ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. మేలు జరిగిందంటేనే ఓటు వేయండి అని అడిగే దమ్మూధైర్యం ఉన్న ఏకైక సీఎం.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్నే ఆశీర్వదించి, మరోసారి సీఎం జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. ఇక్కడి ఎమ్మెల్యే కళావతిని కూడా ముచ్చటగా మూడోసారి గెలిపించుకుని, అసెంబ్లీకి పంపాలన్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు కూడా ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు తెలియజేస్తూనే టీడీపీ హయాంలో జరిగిన మోసాన్ని ఎండగట్టాలన్నారు. రానున్న ఎన్నికల్లో 175 అసెంబ్లీ స్థానాలకు 175 స్థానాలు గెలించేందుకు కృషి చేయాలన్నారు.


కార్యక్రమానికి హాజరైన లబ్ధిదారులు

దేశంలోనే నంబర్‌వన్..

ఎమ్మెల్యే కళావతి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం జగనన్న ప్రజలకు పథకాలు అందిస్తున్నారన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. రాష్ట్రంలో అత్యధికంగా 66.34 లక్షల మందికి పింఛన్లు అందించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేన్నారు. సంక్షేమ పథకాల అమలులో మన రాష్ట్రమే దేశంలో నంబర్‌వన్ అని అన్నారు. ప్రతినెలా పింఛన్‌దారుల కోసం రూ.1,968 కోట్లు కేటాయిస్తోందని, ఏటా రూ.23,556 కోట్లను ప్రభుత్వం వెచ్చిస్తోందన్నారు. ప్రభుత్వ ఏర్పాటు దగ్గర నుంచి కేవలం పింఛన్ల కోసమే రూ.83,526 కోట్లను ప్రభుత్వం ఇచ్చిందన్నారు. సచివాలయ వ్యవస్థతో ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమని, రానున్న ఎన్నికల్లోనూ ఇదే పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, జెడ్పీటీసీ జంపు కన్నతల్లి, వైస్ ఎంపీపీ పద్రి విజయకుమారి, ఎంపీడీవో డి.శ్వేత, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రి లీలాప్రసాదరావు, జిల్లా కార్యదర్శి కళింగ ప్రేమభూషణరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కర్రి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకున్న వెంటనే మంజూరు..



నా పేరు ఈశ్వరమ్మ. మూడు నెలల క్రితం నా భర్త చనిపోయారు. పింఛన్ కోసం వలంటీర్ మా ఇంటికి వచ్చి, దర ఖాస్తు చేయించారు. దరఖాస్తు చేసిన రెండు నెలల్లోనే నాకు పింఛన్ మంజూరైంది. నాకు ఇప్పుడు నెలకు రూ.3 వేలు అందుతోంది. సీఎం జగనన్నకు రుణపడి ఉంటాం. –కర్రి ఈశ్వరమ్మ, వితంతు పింఛన్‌దారు, వీరఘట్టం.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు..



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ప్రతీ మాట నిలబెట్టుకున్నారు. ఏటా రూ.250 చొప్పున సామాజిక పింఛన్ల పెంపు చేపట్టి, ఇప్పుడు ప్రతినెలా పింఛన్‌దారులకు రూ.3 వేలు అందిస్తున్నారు. ప్రతీ ఇంటికి పెద్దకొడుకు లాగా సీఎం జగనన్న నిలిచారు.

–రేజేటి గంగమ్మ, పింఛన్‌దారు, వీరఘట్టం.

సీఎం జగనే మా ధైర్యం..



కడుపున పుట్టిన పిల్లలే తల్లిదండ్రులను పట్టించుకోని రోజులివి. ఇటువంటి పరిస్థితుల్లో సీఎం అయిన జగన్‌మోహన్‌రెడ్డే మా అందరికీ ధైర్యం కల్పిస్తున్నారు. ప్రతినెలా రూ.3 వేలు పింఛన్ అందజేసి, మాకు అండగా నిలుస్తున్నారు. రేపటి బతుకుపై ఆశలు కలిగిస్తున్నారు.

–గొట్టా పార్వతి, పింఛన్‌దారు, వీరఘట్టం.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

- కొత్త పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి


పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో లబ్ధిదారులను ఉద్దేశించి, మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

కురుపాం: అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో జరిగిన పింఛన్ల పంపిణీకి ముఖ్య అతిథిగా ఆమె హాజరై, ఈ నాలుగున్నరేళ్లలో ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును వివరించారు. అన్ని ప్రాంతాలు, అన్నివర్గాల ప్రజలు బాగుండాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తపన అని, అన్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమానికి పాటుపడుతున్నారన్నారు. ఓ వైపు అభివృద్ధి పనులు చేపడుతూనే మరోవైపు సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్నారన్నారు. ప్రతీ సచివాలయం పరిధిలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతోందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల వద్దకే ప్రభుత్వ పథకాలు అందిస్తున్న గొప్పదనం సీఎం జగనన్నదేనన్నారు. టీడీపీ హయాంలో అర్హులకు అన్నివిధాలా అన్యాయం జరిగిందన్నారు. అప్పటి ఆ పార్టీ జన్మభూమి కమిటీల సిఫార్సుల మేరకే ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులు మంజూరయ్యేవన్నారు. ఇప్పుడు అలా కాదని, అర్హులైతే చాలని, ఇంటి వద్దకే పథకాలు వస్తున్నాయన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని 99.5 శాతం హామీలు అమలు చేసిన ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీ అన్నారు. గతంలో ఇచ్చిన మాట ప్రకారం విడతల వారీగా పింఛన్‌ను రూ.3 వేలకు పెంచిందన్నారు. ఇదే అభివృద్ధి, సంక్షేమం కావాలంటే రానున్న ఎన్నికల్లోనూ మళ్లీ వైఎస్సార్ సీపీనే గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ప్రజలకు చేస్తున్న మేలును చూసి, ఓర్వలేకనే ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా లేనిపోని ఆరోపణలతో ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. అయితే వాటిని ప్రజలు నమ్మడం లేదన్నారు. రాష్ట్ర జనమంతా సీఎం జగనన్న వైపే ఉన్నారని, వచ్చే సార్వత్రిక ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీ విజయఢంకా మోగించడం ఖాయమని జోష్యం చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కూడా పార్టీ గెలుపు కోసం సైనికుల్లా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ గార్ల సుజాత, ఎంపీపీ పద్మావతి, జెడ్పీటీసీ గొర్లి సుజాత, వైస్ ఎంపీపీలు బిడ్డిక అన్నాజీరావు, రంగారావు, ఎంపీటీసీలు వెలమల బంగారునాయుడు, గౌడు సంతోషిరాణి, స్వామియాజులు, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్, ఎంపీడీవో అప్పారావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గౌరీశంకరరావు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి


పీఎం జన్‌మన్ పథకం బ్రోచర్లు అందజేస్తున్న ఎంపీడీవో త్రినాథులు

పాలకొండ రూరల్: మండల పరిధిలోని గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టిసారించాలని ఎంపీడీవో డొంక త్రినాధులు అన్నారు.

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ, విద్యుత్ శాఖ సిబ్బందితో పాటు పంచాయతీ కార్యదర్శులతో గురువారం సమావేశమైన ఆయన మండలంలోని ఎం.సింగుపురం, ఓని, వెలగవాడ, డోలమడ, సవరగూడ పంచాయతీల పరిధిలో 168కి పైబడి గిరిజన కుటుంబాలు నివశిస్తున్నాయని, పీఎం జన్‌మన్ కార్యక్రమంలో భాగంగా ఆయా ప్రాంతాల్లో రోడ్లు, తాగునీరు, విద్యుత్, పౌష్టికాహారం వంటి 11 కనీస వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పీఎం జన్‌మన్ పథకం బ్రోచర్లను అధికారులకు ఎంపీడీవో అందజేశారు.

ఓటుహక్కు వినియోగించుకోవాలి

- ఐటీడీఏ పీవో కల్పనాకుమారి


ర్యాలీలో పాల్గొన్న ఐటీడీఏ పీవో కల్పనాకుమారి

పాలకొండ: ప్రతిఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలని ఐటీడీఏ పీవో కల్పనాకుమారి కోరారు. మండల కేంద్రంలో ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తూ గురువారం ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె ఓటు గొప్పతనం, దాని వినియోగం ద్వారా కలిగే ప్రయోజనం ప్రజలకు వివరించారు. ఓటు వజ్రాయుధమని, ఓటు హక్కుతో మనకు నచ్చిన నాయకుడిని ఎన్నుకుని, మనతో పాటు మన ప్రాంత అభివృద్ధిని చేసుకోవచ్చన్నారు. రానున్న ఎన్నికల్లో ఓటర్లంతా తమ ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.సోమేశ్వరరావు, డీటీ బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత


మృతుడి భార్య వనజాక్షికి చెక్కు అందిస్తున్న భువనేశ్వరి

భామిని: మండలంలోని బిల్లుమడ గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త బర్రి విశ్వనాథం ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబాన్ని టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి గురువారం కలిసి పరామర్శించారు. అనంతరం మృతుడి భార్య వనజాక్షికి రూ.3 లక్షల ఆర్థికసాయం చేశారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే విశ్వనాథం కుమారుడికి ఉపాధి కల్పిస్తామని ఆమె భరోసా ఇచ్చారు. ఆమె వెంట ఆ పార్టీ నాయకుడు నిమ్మక జయకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహ స్వామికి ప్రత్యేక అలంకరణ



సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖి నది ఒడ్డున కొలువైన లక్ష్మీనృసింహ స్వామి భక్తులకు గురువారం ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో తులసీదళాలు, వివిధరకాల పూలతో స్వామిని అలంకరించారు. ఈ మేరకు ఆలయానికి చుట్టు పక్కలున్న నాలుగుమండలాల గ్రామ, పట్టణ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకునేందుకు పూజాసామగ్రితో వివిధ రకాలవాహనాలతో తరలి వచ్చి క్యూలో లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకుని ముడుపులుచెల్లించారు. భక్తులకు పూజలనంతరం తీర్థ ప్రసాదాల వితరణ చేశారు.

19వ పాశురం

బలిజిపేట: ధనుర్మాసం సందర్భంగా బలిజిపేట రామాలయంలో 19వ పాశురం కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో భక్తులు 108 దీపాలు వెలిగించారు. ధనుర్మాసంలో కార్యక్రమాలు చేసే వాటిలో దీప పాశురం విశేషమని, దీన్ని ఎంతో గొప్పగా జరుపుకుంటారని అర్చకుడు శ్రీనివాసాచార్యులు తెలిపారు. స్వామివారిని పూలతో అలంకరించి, ధూప,దీప నైవేద్యాలను సమర్పించారు. భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఉన్నత లక్ష్యం ఏర్పర్చుకోవాలి


విద్యార్థులకు దిశానిర్దేశం చేస్తున్న ఉపాధ్యాయుడు అనంతబాబు

సీతంపేట: విద్యార్థులు ఉన్నత లక్ష్యం ఏర్పర్చుకుని, దాని సాధనకు కృషి చేయాలని చిన్నబగ్గ పాఠశాల భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు డి.అనంతబాబు అన్నారు. గురువారం స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల(బాలికలు)లో విద్యార్థులకు మోటివేషన్ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన 8, 9, 10వ తరగతుల విద్యార్థులు ఉత్తమ భవిష్యత్‌కు ఎటువంటి లక్ష్యాలు ఏర్పాటు చేసుకోవాలని, వాటిని ఏ విధంగా చేరుకోవాలన్న అంశాలను క్షుణ్నంగా వివరించారు. వీటితో పాటు మంచి అలవాట్లు ఎలా నేర్చుకోవాలి, వాటిని ఎలా కొనసాగించాలి, కాలం నిర్వహణ, క్రమశిక్షణ, పెద్దలు, ఉపాధ్యాయుల పట్ల గౌరవభావం వంటి విషయాలను తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎ.లిల్లీరాణి, హెచ్‌డబ్ల్యూవో పాలక అమల తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బ్రెయిలీ జయంతి


బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు మాలతి


గరుగుబిల్లి: మండల కేంద్రంలోని ఎంఆర్సీ భవనంలో లూయీ బ్రెయిలీ జయంతి గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భవిత కేంద్రంలో ప్రాథమిక పాఠశాల హెచ్ఎం మాలతి బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆమె బ్రెయిలీ జీవిత చరిత్రను వివరించారు. అంధుల కోసం ఆయన ప్రత్యేకంగా ఓ లిపిని రూపొందించి, వారి పాలిట దైవంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో ఐఈఆర్పీ వై.వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం


అన్నప్రసాదం స్వీకరించేందుకు క్యూలైన్‌లో ఉన్న భక్తులు

గరుగుబిల్లి: స్థానిక షిర్డీసాయిబాబా మందిరం ప్రాంగణంలో భక్తులకు గురువారం అన్నదానం చేశారు. ఉదయం ఆలయంలో సుప్రభాతసేవ, కాగడహారతి, విశేషార్చనలు, అభిషేకాలు చేశారు. గరుగుబిల్లి, హిక్కింవలస, పెద్దూరు, రావుపల్లి తదితర గ్రామాల నుంచి బాబా దర్శనానికి భక్తులు విచ్చేశారు.

విస్తారంగా పత్తి సాగు


మల్లుగూడలో పత్తిని సేకరిస్తున్న మహిళ

గుమ్మలక్ష్మీపురం: మండల వ్యాప్తంగా పత్తి సాగు విస్తారంగా జరిగింది. మండలంలోని 326 ఎకరాల్లో రైతులు పత్తిని సాగు చేయగా, దిగుబడి బాగా వచ్చిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పత్తి సేకరణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

సికిల్‌సెల్ ఎనీమియాపై అవగాహన కల్పించాలి


మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో కల్పనాకుమారి

సీతంపేట: గిరిజన గ్రామాల్లో సికిల్‌సెల్ ఎనీమియాపై అవగాహన కల్పించాలని ఐటీడీఏ పీవో కల్పనాకుమారి తెలిపారు. గురువారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో వైద్య సిబ్బందితో సమావేశమైన ఆమె వ్యాధితో బాధపడుతున్న వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌష్టికాహారం వివరాలు వెల్లడించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో విజయపార్వతి తదితరులు పాల్గొన్నారు.

నిజం గెలవాలి పేరిట నకిలీయాత్రలు


మాట్లాడుతున్న బిల్లుమడ సర్పంచ్ రాధాకృష్ణ

భామిని: టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి నిజం గెలవాలి పేరిట నకిలీయాత్రలు చేపడుతున్నారని బిల్లుమడ సర్పంచ్ సిగడాన రాధాకృష్ణ విమర్శించారు. గ్రామంలోని స్వగృహం వద్ద గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ పంచాయతీకి చెందిన బర్రి విశ్వనాథం అనే వ్యక్తి కుటుంబ కలహాల కారణంగా పూటుగా మద్యం తాగి, చనిపోతే అతడి మరణాన్ని కూడా చంద్రబాబును జైల్లో పెట్టడాన్ని తట్టుకోలేకే బెంగతో చనిపోయినట్లు చిత్రీకరించి, ఆ కుటుంబాన్ని ఇప్పుడు భువనేశ్వరి కలిసి పరామర్శించడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నికల వేళ శవరాజకీయాలకు టీడీపీ నాయకులు ప్రయత్నిస్తున్నారని, ఇదంతా ప్రజలు గమనిస్తున్నారన్నారు. టీడీపీ గానీ ఆ పార్టీ నాయకులు గానీ ఎన్ని కుయుక్తులు పన్నినా ఫలితం శూన్యమన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలే టీడీపీ అబద్ధాలకు బుద్ధి చెబుతారన్నారు. వైఎస్సార్ సీపీకి, ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతికి ప్రజల్లో ఉన్న ఆదరణను చూసి, ఓర్వలేకనే కొంతమంది టీడీపీ నాయకులు లేనిపోని ఆరోపణలతో బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని, ప్రజలు గమనించాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు సిగడాన రాజు, రూపకుమారి, దామోదరావు, శ్రీరామ్, నిమ్మల ప్రమోద్, సరిసభద్ర చిరంజీవులు తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా 'ఆడుదాం ఆంధ్రా'


మాట్లాడుతున్న ఎంపీడీవో సాల్మన్‌రాజు

గుమ్మలక్ష్మీపురం: పక్కాగా ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు నిర్వహించాలని ఎంపీడీవో ఎస్.సాల్మన్‌రాజు సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పీఈటీలు, పీడీలతో గురువారం సమావేశమైన ఆయన గ్రామసచివాలయ స్థాయిలో ప్రస్తుతం పోటీలు ముగియనుండడంతో ఈ నెల 10వ తేదీ నుంచి మండల స్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక కోసం పోటీలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో ఈవోపీఆర్‌డీ జి.జగదీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.